క్లుప్తంగా

నగరాలు కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా

మధురవాడ: ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పదవికి మధురవాడకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన శ్రీనివాసరావు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ప్రత్యేక కార్యదర్శికి మెయిల్‌లో పంపించినట్టు ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో తాను రాజీనామా చేశానని, సత్వరమే ఆమోదించాలని కోరారు. అలాగే డైరెక్టర్ పదవికి రేవళ్లపాలెంకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు వి.శ్యామల రాజీనామా చేశారు.

ఇద్దరు డైరెక్టర్ల రాజీనామా

తగరపువలస : గత ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లుగా పనిచేసిన ఇద్దరు తమ పదవులకు రాజీనామా చేశారు. తగరపువలసకు చెందిన పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, ఆనందపురం మండలం కుసులవాడకు చెందిన దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ల గౌరి తమ రాజీనామా పత్రాలను రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీకి సోమవారం పంపించారు.

నేడు నల్లమారమ్మ ఉత్సవం



నల్లమారమ్మ ప్రతిమ వద్ద పందిరి

పద్మనాభం : మండలంలోని కురపల్లిలో మంగళవారం నల్లమారమ్మ ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కురపల్లి గ్రామస్తులు నల్లమారమ్మకు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. నల్ల మారమ్మ ప్రతిమగా భావించే రాయికి రంగులు వేశారు. ప్రతిమపై పందిరి వేశారు. మామిడి, అరటి తోరణాలతో అందంగా అలంకరించారు.

బోరు ఏర్పాటుకు వినతి



ఎంపీపీ రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ రెల్లిపేటలో మండల పరిషత్ నిధులతో బోరు ఏర్పాటు చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబుకు మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణ మూర్తిరాజు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. బోరు ఏర్పాటు చేసి రెల్లిపేట వాసుల తాగునీటి అవసరాలు తీర్చాలని ఆయన కోరారు. ఆయనతో పాటు అనంతవరం మాజీ ఉప సర్పంచ్ జి.చంద్రరావు ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



చిట్టివలసలో క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న కలిగొట్ల శ్రీరామ్

తగరపువలస : భీమిలికి చెందిన కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చిట్టివలసలో 30 మంది క్రీడాకారులకు రూ.18 వేల విలువైన దుస్తులు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ టీ షర్టులు, ట్రాక్‌సూట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో వీటిని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వెంపాడ శ్రీనివాస రెడ్డి, దత్తి ఈశ్వరరావు, ప్రేమ్‌కుమార్ రెడ్డి, ప్రేమానందం, జల్లు తిరుపతి రావు, నందిక రమణ, మాదాబత్తుల శంకర్‌కుమార్, కుంచం రమణ, మాకాల శంకర్, రంగూరి గిరిధర్, కోసూరి రాంబాబు, కె.సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా వాకింగ్ ట్రాక్

- వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు



చెరువుకు మూడు వైపులా మట్టితో వాకింగ్ ట్రాక్



వర్షాలకు బురదమయమై గట్టిపడిన వాకింగ్ ట్రాక్



సంగివలస చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌కు పాక్షికంగా అతికించిన టైల్స్



వాకింగ్ ట్రాక్ మధ్యలో గోతులు



వాకింగ్ ట్రాక్ మధ్యలో కోతకు గురైన భాగం

తగరపువలస : సంగివలస కోటప్పకొండ చెరువు చుట్టూ దివీస్ లేబొరేటరీ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ ప్రస్తుతం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ఈ ట్రాక్‌పై వాకింగ్ చేసే ఔత్సాహికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం రూ.2.25 కోట్ల సీఎస్‌ఆర్ నిధులను చెరువు చుట్టూ అభివృద్ధి పనులకు ఖర్చు చేసింది. అందులో భాగంగా చెరువు చుట్టూ రాతికట్టు, వాకింగ్ ట్రాక్, సిమెంట్ బెంచీలు, చిల్డ్రన్స్ పార్కు, వృద్ధులకు కుటీరాలు నిర్మించింది. వీటి నిర్వహణ బాధ్యతలను జీవీఎంసీకి అప్పగించింది. అయినప్పటికీ జీవీఎంసీ వీటిని ఎప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఇవి ఆకతాయిలకు అడ్డాగా మారిపోయాయి. వృద్ధుల కోసం నిర్మించిన కుటీరాలు ఆకతాయిలు తగలబెట్టగా, సిమెంట్ బెంచీలను విరగ్గొట్టారు. చిల్డ్రన్స్ పార్కులోని వస్తువులు దొంగల పాలయ్యాయి. చెరువు చుట్టూ రాతికట్టు నిర్మాణంలో లోపాలు కారణంగా పక్క గ్రామాల్లో కురిసన వర్షం నీరు చెరువులోకి, చెరువులోని నీరు బయటకు వెళ్లకుండా ఉండిపోతోంది.

వాకింగ్ ట్రాక్‌నూ పట్టించుకోలేదు

చెరువు చుట్టూ సుమారు 400 మీటర్లు ఉండే వాకింగ్ ట్రాక్‌లో ఒక దిక్కున మాత్రమే టైల్స్‌తో తీర్చిదిద్దారు. వీటికి కూడా నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం భూమిలోకి కుంగిపోతున్నాయి. మిగిలిన వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా చాలా వరకు రక్షణ లేకపోవడం, ఉన్నచోట నాణ్యంగా నిర్మాణం చేపట్టకపోవడంతో కుంగిపోయింది. ముఖ్యంగా వర్షాలు కురిసే సమయంలో ట్రాక్ అడుగు భాగం కిందకు దిగిపోవడంతో వర్షం నీటి ప్రవాహానికి కోతలా ఏర్పడుతోంది. ఇంకా కొన్ని చోట్ల వర్షం నీరు నిలిచిపోవడంతో బురదగా మారి ఎండిపోయిన చోట గుంటలుగా మారుతోంది. దీంతో ఈ ట్రాక్‌లో ఉదయం, సాయంత్రం వాకింగ్, జాగింగ్ చేసేవారు కింద పడుతున్నారు. మారుతున్న జీవనశైలిని అనుసరించి పట్టణ ప్రజలకు వాకింగ్ అవసరం కారణంగా జీవీఎంసీ జోక్యం చేసుకుని ట్రాక్‌కు మెరుగులు దిద్దాలని కోరుతున్నారు. ఆలయం వైపు ట్రాక్‌కు ఇరువైపులా రక్షణ, అవసరమైన చోట గ్రావెల్, టైల్స్ వేసి పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఇటీవల పార్కులో వ్యాయామానికి వచ్చే యువత, వృద్ధులు సొంతంగా తుప్పలు తొలగించుకుని మార్గాలను సుగమం చేసుకున్నారు. అయినప్పటికీ ట్రాక్ పూర్తి స్థాయిలో వినియోగానికి జీవీఎంసీ ముందుకు రావాలని పట్టణ ప్రాంత యువకులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు.

వ్యర్థాలతో తీరం ఘోరం



రుషికొండ బీచ్‌లో పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు, చెత్త



రుషికొండ బీచ్‌లో పెద్ద ఎత్తున దర్శనమిస్తున్న వ్యర్థాలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. ఇక్కడి బీచ్‌ను ఇష్టపడని వారుండరు. విశాఖ వాసులతో పాటు దేశ విదేశీయులు కూడా రుషికొండ బీచ్ అంటే మక్కువ చూపుతారు. ఈ బీచ్ బ్లూ ఫ్లాగ్ గుర్తింపు కూడా పొందింది. విశాలమైన తీరం, అద్దాన్ని ప్రతిబింబించేలా తీర ప్రాంతం ఉండటంతో రోజూ వేలాది సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. శని, ఆది వారాలతోపాటు ఇతర సెలవు దినాల్లో బీచ్‌కు చేరుకునే పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటుంది. అటువంటి గుర్తింపు పొందిన తీరానికి పాలిథిన్ కవర్లు, మట్టికుండలు, వాడేసిన దుస్తులు కొట్టుకు రావడంతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేశారు. బీచ్ పొడవునా వ్యర్థాలు ఉండటంతో ఇక్కడ గడిపేందుకు వచ్చిన పర్యాటకులు దుర్వాసన భరించలేక వెనుదిరుగుతున్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఈ బీచ్ అధికారుల నిర్లక్ష్యంతో కళ తప్పుతోందని పర్యాటకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డెబ్రిస్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



డెబ్రిస్ తొలగింపు పనులు పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట శివాలయం ఎదురుగా గోస్తనీనది మార్గంలో డెబ్రిస్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో బాబ్‌కాట్‌తో సోమవారం తొలగించారు. జోన్‌లోని వివిధ గ్రామాల నుంచి పలువురు డెబ్రిస్, చెత్త తీసుకొచ్చి బంగ్లామెట్ట వద్ద డంప్ చేయడంతో ఈ ప్రాంత వాసులు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై 'డెబ్రిస్ డంప్‌తో దుర్వాసన' శీర్షికతో సాక్షిలో ఆదివారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎవరూ ఈ స్థలంలో డెబ్రిస్, చెత్త వేయవద్దని, వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విస్తరణకు నోచుకోని తాటితూరు రహదారి



తాటితూరు రహదారిలో శిథిలమైన పాత మదుములు



శిథిలమైన తాటితూరు బీటీ రహదారి

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి చేరుకునే రహదారిలో సగానికి పైగా శిథిలావస్థకు చేరుకుంది. మహరాజుపేట కూడలి నుంచి తాటితూరు పంచాయతీకి చేరుకునే ప్రధాన రహదారి సుమారు రెండు కిలోమీటర్ల మేర పొడవు ఉంటుంది. ఈ మార్గంలో మూడు చోట్ల పురాతన నీటి మదుములు ఉన్నాయి. ఈ మదుములపై రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఈ మార్గంలో ప్రజలు రవాణాకు వినియోగించే వాహనాలతోపాటు ఇటుక బట్టీలకు చెందిన యజమానులు భారీ వాహనాల ద్వారా నిత్యం ఇటుక, బొగ్గు, కలప, మట్టి రవాణా చేస్తుంటారు. దీంతో పటుత్వం కోల్పోయిన బీటీరోడ్డుకు ఎక్కడికక్కడే పగుళ్లు ఏర్పడ్డాయి. అసలే ఇరుకైన రహదారిపై పగుళ్లు ఏర్పడడంతో వేగంగా ప్రయాణించే వాహనాలు ఒడిదుడుకులకు లోనై ప్రమాదాలకు గురవుతున్నాయి. టి.నగరపాలెం పంచాయతీ మీదుగా తాటితూరుకు మరో మార్గం ఉన్నప్పటికీ ఇదే ప్రధాన రహదారి కావడంతో ఎక్కువ మంది ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాటితూరుకు ఉదయం, సాయంత్రం వేళల్లో సిటీ బస్సు నడిచేది. ఈ రహదారి అప్పటికే శిథిలం కావడం, ఆటోలు ఎక్కువగా రావడంతో బస్సు సర్వీస్‌ను నిలిపివేశారు. పంచాయతీలో జెడ్పీ హైస్కూల్ సహా మూడు పాఠశాలలు, వందలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ భూములు, ఇటుక బట్టీల కాలుష్యం మధ్య నుంచి రాకపోకలు సాగించే తాటితూరు పంచాయతీకి రహదారిని ఆధునికీకరించి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మొగధారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ సమీపంలో గల శ్రీ మొగధారమ్మ మహాలక్ష్మి పద్మాలయమును అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సోమవారం సందర్శించారు. ముందుగా మొగధారమ్మ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఆయనవెంట స్థానిక నాయకులు మంగరాజు, కొల్లి రమణ, నొడగల రాంబాబు, సారిపిల్లి అప్పలస్వామి, పంచదర్ల గోపి, తదితరులు వున్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

అంధకారంలో పువ్వుల మార్కెట్ కూడలి

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పువ్వుల మార్కెట్ కూడలి గత ఐదు రోజులుగా అంధకారంతో నిండిపోయింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలగక చీకటిమయమైంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. విద్యుత్ దీపాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యావాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

రూ.50 లక్షలతో జోనల్ కార్యాలయం ఆధునికీకరణ



జోనల్ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేసి రంగులు వేస్తున్న కూలీలు



జెడ్సీ చాంబర్‌లో ఆధునికీకరణ పనులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం భవనం ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో బ్రిటిష్ వారు నిర్మించిన భవనంలో మున్సిపల్ కార్యాలయం నిర్వహించేవారు. అది దెబ్బతినడంతోపాటు పనులు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉండడంతో 2010లో దాని పక్కనే కొత్త భవనం నిర్మించారు. అప్పటి నుంచి ఇందులోనే మున్సిపల్ కార్యాలయం నిర్వహించారు. 2013లో మున్సిపాలిటీ జీవీఎంసీలోకి విలీనం కావడంతో అప్పటి నుంచి జోనల్ కార్యాలయంగా మార్చారు. ప్రస్తుతం ఇందులో ఉన్న జోనల్ కమిషనర్ చాంబర్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది ఉండే గదులు దెబ్బతినడంతోపాటు పనుల నిర్వహణకు ఇబ్బందికరంగా మారాయి. దీనిపై స్పందించిన గత ప్రభుత్వం భవన ఆధునికీకరణకు రూ.50 లక్షలు మంజూరు చేసింది. గత రెండు నెలల నుంచి ఇక్కడ భవనానికి మరమ్మతులు నిర్వహించడంతోపాటు, లోపల గదులకు అవసరమైన మరమ్మతులు జరుగుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో అన్ని సదుపాయాలతో అందుబాటులోకి రానుంది. సిబ్బంది ఇబ్బంది లేకుండా ఆధునిక సదుపాయాలతో విధులు నిర్వహించుకోవడానికి అవకాశం ఏర్పడనుంది.

కొత్తమ్మతల్లికి పసుపు, కుంకుమ సమర్పణ నేడు



సంతపేట కొత్తమ్మతల్లి

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లికి మంగళవారం పసుపు, కుంకుమ సమర్పించనున్నారు. ఈ సందర్భంగా సంతపేట, కొత్తపేట, చిట్టివలస కార్మికవాడ, విల్సన్‌పేట, వెలంపేట తదితర గ్రామాల ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. కొత్తపేట, సంతపేట గ్రామాల నుంచి అమ్మవారి ఆలయం వరకు బాణసంచా, నేలవేషాలు, పులివేషాలు, సాముగరిడీ తదతర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

విద్యార్థినికి రూ.31 వేల అందజేత



రిషితశ్రీకి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి పూర్వ విద్యార్థులు సోమవారం నగదు బహుమతి అందించారు. భీమిలికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు కుమార్తె మైలపల్లి రిషితశ్రీ పదో తరగతి ఫలితాల్లో 595 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. దీనిపై స్పందించిన సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 1972 – 73వ సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు రూ.31 వేల నగదు బహుమతి రిషితశ్రీకు అందించారు. అడిదం సన్యాసిరాజు, లచ్చుబుగత గణపతిరావు, కర్రోతు నాగేంద్రకుమార్, కట్టమూరి జగదీష్, ఏసు భాస్కర ప్రసాద్ పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలగక అవస్థలు

- మానం ఆంజనేయులు కాలనీ పరిసర ప్రాంతాల్లో చీకట్లు



మానం ఆంజనేయులు కాలనీలో వీధిలైట్లు వెలగని స్తంభాలు



వీధిలైటు లేని విద్యుత్ స్తంభం

మధురవాడ : జీవీఎంసీ 5, 7 వార్డుల్లో కొన్ని చోట్ల వీధిలైట్లు లేక, మరికొన్ని చోట్ల ఉన్నవి వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 7వ వార్డు మానం ఆంజనేయులు కాలనీ చర్చి వద్ద ఉన్నవి వెలగకపోగా... కొద్ది నెలల క్రితం వేసిన స్తంభాలకు విద్యుత్ లైట్లు లేకపోవడంతో అంధకారం అలముకుంటోంది. అలాగే మారికవలస ఆర్‌జీకే కాలనీ, వాంబేకాలనీ రోడ్డు, ఆర్‌టీసీ కాలనీ, మిథిలాపురి ఉడా కాలనీ నుంచి ఎన్‌జీజీవోస్ కాలనీకి వెళ్లే రోడ్డు, తదితర చోట్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్‌జీజీవోస్ కాలనీ, వాంబే కాలనీ, మానం ఆంజనేయులు కాలనీ వంటి నిర్మానుష్య ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో వీధిలైట్లు లేకపోవడంతో ఆకతాయిల ఆగడాలు, చిల్లర దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు చీకటిపడితే ఇళ్ల నుంచి వెలుపలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా ఎన్నికల సమయంలో జీవీఎంసీ విద్యుత్ శాఖ సిబ్బంది చిన్నపాటి ఫిర్యాదులు కూడా పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెలగని వీధిదీపాలు

తగరపువలస : జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం పరిధిలోని చాణిక్యపురి, గుప్తా లే అవుట్, కృష్ణా కో ఆపరేటివ్ సొసైటీ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వెలగని వీధి దీపాల పునరుద్ధరణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత సీనియర్ సిటిజన్లు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో 61 ఎ(4) (5) (6), 61 ఎ2(1), 61 ఎ2(5), 62 ఎ12/1, 107బి, 107/18, 456/1/2, 456బి51, 456బి52 విద్యుత్ స్తంభాల వీధిదీపాలు వెలగనందున వృద్ధులు ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మందుబాబులకు రూ.30,500 జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసులకు చిక్కిన మందుబాబులకు న్యాయస్థానం జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల కారుషెడ్ కూడలి, కొమ్మాది, మారికవలస కూడళ్లలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ మొత్తం రూ.30,500 జరిమానా విధించారు.